క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పూజలు



పోతవరంలో ధ్వజస్తంభానికి కలశాలతో జలాభిషేకం చేస్తున్న భక్తులు

నల్లజర్ల: పోతవరం–కవులూరు గ్రామాల మధ్య ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నారు. గురువారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, మండపపూజ, ఉమారామలింగేశ్వర స్వామి హోమాలు, సామూహిక కుంకుమార్చనలు వేదపండితులు సతీష్ శర్మ, కృష్ణబాబు, సూరిబాబుల ఆధ్వర్యంలో జరిగాయి. శుక్రవారం ఉదయం 11.26 నిమిషాలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మోతుక్కురి శ్రీనివాస్ తెలిపారు. రూ.2 లక్షల విలువైన గ్రానైట్ ధ్వజస్తంభాన్ని కవులూరుకు చెందిన గద్దె రాఘవులు, నరసింహమూర్తి, భద్రం దంపతులు అందజేసినట్టు చెప్పారు. ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈరెండు గ్రామాలలో భక్తులు, బంధువులతో పండగ వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయుడు లాల్‌నెహ్రూకు అవార్డు



టీచర్ లాల్‌నెహ్రూను సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

నల్లజర్ల: గోదావరి ఉత్సవ్ మహోత్సవ్ రాజమహేంద్రవరంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లజర్లకు చెందిన కళాకారుడు, టీచర్ కేఏఎం లాల్‌నెహ్రూకు తెలుగుతేజం అవార్డును గజల్‌శ్రీనివాస్ అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



బల్ల బాలయోగి సుబ్బారావు

పెరవలి: చెల్లిని చూడటానికి వచ్చి కనిపించకుండా పోవటంతో పెరవలి పోలీసులను ఆశ్రయించారు. పెరవలి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మామిడికుదురు గ్రామానికి చెందిన బల్ల బాలయోగి సుబ్బారావు (70) ఈనెల 2న పెరవలి మండలం కానూరులో చెల్లిని చూసి 3న వేళంగి గ్రామం వెళుతున్నానని చెప్పి బయలుదేరాడని తీరా ఫోన్ చేస్తే ఇక్కడకు ఎవరు రాలేదని చెప్పడంతో బంధువులు అందరికీ ఫోన్‌లు చేసినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. మూడు రోజులు వెతుకుతున్నా కనిపించకుండా పోవటంతో ఈ రోజు పెరవలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పెరవలి పోలీస్ స్టేషన్‌కు లేక ఎస్సై ఫోన్ నంబర్ 94407 96642కి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రత్యేక శ్రద్ధతోనే ఉత్తమ ఫలితాలు

నిడదవోలు రూరల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ కేవీ గణేష్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయంలో జెడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై గురువారం సమీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులలో సబ్జెక్టు టీచర్లు మంచి మార్కులు సాధించేలా ప్రణాళికతో చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.గురుమూర్తి, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో విద్యార్థిని ప్రతిభ

చాగల్లు: స్థానిక రాజరాజేశ్వరి విద్యాలయలో 8వ తరగతి చదువుతున్న తాళ్లూరి సింధుప్రియ కూచిపూడి నృత్య ప్రదర్శనలో విశేష ప్రతిభ చూపింది. అయోధ్య రామమందిరం వద్ద, వారణాసి గంగా హారతి ఘాట్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఈ ప్రదర్శనలకు గాను బాలరామ, నటరాజ పాలమంజీరం పురస్కారాలు అందుకున్నట్టు పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు తెలిపారు. శ్రీమువ్వ గోపాల కల్చరల్ ఆర్ట్ అకాడమీ ఆహ్వానం మేరకు విద్యార్థిని ఈ ప్రదర్శనలో పాల్గొన్నట్లు చెప్పారు. కాగా ప్రతిభ చూపిన విద్యార్థిని సింధుప్రియను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: పట్టణంలో చినకాశిరేవులో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ద్వారకామాయి మందిరం వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, వివిధ రకాల ఫలాలు, 58 కేజీల గోధుమలతో అర్చనలు, లక్షపుష్పార్చనలు చేశారు.



పెరవలి ఇరిగేషన్ కార్యాలయం సమీపాన ప్రమాదకరంగా ఉన్న మలుపు



పెరవలి జాతీయ రహదారిని కలిపే ప్రమాదకరమైన మలుపు

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- అన్ని ప్రమాదాలూ మలుపుల వద్దే..
- పట్టించుకోని అధికారులు
- కనీసం హెచ్చరిక బోర్డులు కరవు
- 36 ప్రమాదాలు, 22 మంది క్షతగాత్రులు, 18 మంది మృతులు

పెరవలి: పెరవలి రహదారులు అసలే అంతంత మాత్రం. వీటిపై ఉన్న మలుపులు ప్రమాదానికి పిలుపులుగా మారాయి. ఈ రహదారులపై ఉన్న మలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మండలంలో 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 35 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారులు ఉన్నాయి. నిడదవోలు–నర్సాపురం రహదారిపై మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ఈ రహదారి ఒక వైపు నర్సాపురం కాలువ, రెండో వైపున పంటపొలాలు ఉండటం వలన ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పెరవలి నుంచి కాకరపర్రు వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రహదారిలో ఆరు మలుపులు ఉండగా వీటిలో రెండు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గత పదేళ్లుగా ఇక్కడ 36 ప్రమాదాలు జరగ్గా 22 మంది క్షతగాత్రులయ్యారు. 18 మంది మృతి చెందారు. మూడేళ్ల క్రితం జూలై నెలలో ఈ మలుపుల వద్ద ఆటోను లారీ ఢీకొట్టడంతో కాలువలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఆ మరుసటి రోజే రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రెండేళ్ల క్రితం ఫిబ్రవరిలో పైన రెండు ప్రమాదాలు జరిగిన మలుపులోనే లారీ ఢీకొట్టడంతో ముగ్గురు చనిపోయారు. మేలో లారీ సైక్లిస్టులను ఢీకొట్టగా ఒకరు చనిపోయారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఆటో కాలువలోకి వెళ్లిపోవడంతో ఇద్దరు చనిపోయారు. మరో మలుపు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉండగా ఇక్కడ గత ఏడాది ఏడు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఎనిమిది మంది గాయపడగా ఇద్దరు చనిపోయారు. కాకరపర్రు వద్ద ఉన్న మలుపు వీటి అన్నింటి కన్నా ప్రమాదకరమైంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. ఇక్కడ రోడ్డుతో పాటు వంతెన కూడ వంపుగా ఉండటంతో వేగంగా వచ్చిన వాహనాలు అదుపుతప్పి కాలువలోకి నేరుగా వెళ్లి ప్రమాదాల బారిన పడతారు. మూడేళ్ల క్రితం ఏప్రిల్ 28న ఇక్కడ లారీ వేగంగా వచ్చి కాలువలో పడిపోయింది. ఈ ప్రమాద సమయంలో కాలువలో నీరు లేక పోవటం వలన డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. ఎనిమిదేళ్ల క్రితం అరటిగెలల లోడుతో వస్తున్న లారీ ఈ మలుపులో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు మృతి చెందగా 12 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు శాశ్వతంగా వికలాంగులుగా మారిపోయారు. ఇలా మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఇరిగేషన్, పోలీసు శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో ఈ మలుపుల వలన జరిగిన ప్రమాదాల గురించి 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఆర్అండ్‌బీ అధికారులు మలుపుల వద్ద సిమెంట్‌పోల్స్‌ను కాలువవైపు ఏర్పాటు చేశారు. ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే కొన్ని ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని పలువురు చెబుతున్నారు.

ఎక్కువగా జరుగుతున్నాయి



పెరవలి మండలంలో ఉన్న ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకు వేగంగా రావడం, వాహనాలు అదుపుతప్పడం కూడా కారణం. కనీసం ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో రోడ్డు ఉన్న భ్రమలో వాహనాలు వచ్చి ప్రమాదాలకు గురి అవుతున్నాయి.

– కోటిపల్లి రాంబాబు, ట్రాక్టర్ డ్రైవర్

ప్రమాదాలకు పిలుపులుగా మారాయి



రోడ్లలో ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు కాలువలోకి లేక, పంటపొలాల్లోకి వెళిపోతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు ఆగడం లేదు.

– కుసుమే సూరిబాబు, గ్రామస్తుడు, ఖండవల్లి

మహాలింగేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ



మహాలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ నరసింహ కిశోర్

దేవరపల్లి: గౌరీపట్నంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి వారిని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ గురువారం దర్శించున్నారు. అత్యంత ఆధునికంగా పునర్నిర్మించిన స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. వేద పండితులు, దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యాన ఎస్పీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయనకు పండితులు వేదాశీర్వాదం చేసి, ఘనంగా సత్కరించారు.

లేగదూడల ప్రదర్శన

చాగల్లు: పశుపోషణలో లేగ దూడల సంరక్షణ ఎంతో బాధ్యతతో కూడుకున్నదని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వి.రుషిప్రసాద్ అన్నారు. మండలంలోని కలవలపల్లిలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 55 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొనగా మేలిమి దూడలను పెంచిన రైతులకు బహుమతులు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న 42 మంది పాడి రైతులకు పాల క్యాన్‌లు, ఖనిజ లవణ మిశ్రమం ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎంఎం రాజేష్, సోమశేఖర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామయ్య శత జయంతి

ఉండ్రాజవరం: మండలంలో వేలివెన్నులో శిద్ధాశ్రమం వ్యవస్థాపకుడు నందిగం సీతారామయ్య శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సీతారామయ్య కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ప్రముఖులు సీతారామయ్యకు నివాళులు అర్పించి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. తాలుకా వ్యవస్థను రద్దు చేసిన అనంతరం వచ్చిన మండల వ్యవస్థలో ఉండ్రాజవరం మండలానికి మొట్టమొదటి మండల పరిషత్ అధ్యక్షుడిగా సీతారామయ్య ఎన్నికయ్యారు. 25 ఏళ్ల వేలివెన్ను సర్పంచ్‌గా గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన సిద్ధాశ్రమంలో నేటికీ కేరళ, తమిళనాడు నుంచి సిద్ధ విద్యార్థులు వచ్చి 41 రోజుల పాటు జపం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. శత జయంతి వేడుకల్లో తణుకు వైద్యుడు తాతిన రామబ్రహ్మం



వేలివెన్నులో సీతారామయ్య కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

, డాక్టర్ దాసరి వెంకట్రావు, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామారావు, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, పలు ప్రైవేట్ స్కూల్ అధినేతలు పాల్గొని సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

'తలారి'ని కలసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు తలారిని పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షురాలు అంకోలు లిల్లీ వెంకట పద్మ లీల, లీగల్ సెల్ అధ్యక్షుడు కవల నాగేశ్వరరావు, సోషల్ మీడియా అధ్యక్షుడు దాకే ధర్మరాజు, ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు బోడపాటి హనుమంతరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు చొప్పాల అప్పలనాయుడు, ఆర్‌టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు మాసా ఆనంద్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు,



కొవ్వూరులో తలారి వెంకట్రావును సత్కరిస్తున్న జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, పలు విభాగాల అధ్యక్షులు

బడ్డిరెడ్డి వెంకటేశ్వరరావు, పరిమి సోమరాజు, గోలి శ్రీనివాస్, చిట్టూరి అన్నవరం, వంబోలు పోసిబాబు, నామా ప్రకాశం, బండారు నాగేశ్వరరావు, వి.శ్రీనివాస్ తదితరులు వెంకట్రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

నాడు పరిహారం ఇస్తామని.. నేడు అడ్డం తిరిగి..

- మృతుని కుటుంబానికి డబ్బులు ఇవ్వడానికి ట్రాక్టర్ యజమాని నిరాకరణ
- పోతవరంలో బంధువుల రాస్తారోకో
- రెండు గంటల సేపు నిలిచిపోయిన వాహనాలు
- సీఐ హామీతో ఆందోళన విరమణ

నల్లజర్ల: పోతవరం గ్రామ శివారున ఈ నెల 3న జరిగిన ట్రాక్టర్ ఢీకొని యువకుడు తానేటి హరిశ్చంద్ర ప్రసాద్ బాబు (24) మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి ఐదు నెలల క్రితమే వివాహం జరిగింది. భార్య ప్రస్తుతం మూడో నెల గర్భిణి. ప్రసాద్ బాబు మృతి నేపథ్యంలో అతడి భార్యకు పరిహారంగా కొంత సొమ్ము ఇచ్చేందుకు గ్రామ పెద్దల సమక్షంలో కవులూరుకు చెందిన ట్రాక్టర్ యజమాని కుందుల అయ్యప్ప అంగీకరించాడు. ఈ మేరకు కాగితాలు కూడా రాసుకున్నారు. ప్రసాద్ బాబు దహన సంస్కారాలు పూర్తయ్యాక డబ్బులు ఇచ్చేది లేదంటూ అయ్యప్ప అడ్డం తిరిగాడు. మధ్యవర్తులు కూడా చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో అయ్యప్ప ట్రాక్టర్ చెరకు లోడుతో పోతవరం వైపు వస్తుండగా మృతుని బంధువులు నిలుపు చేశారు. పరిహారం విషయమై అయ్యప్ప సరైన సమాధానం చెప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు రాస్తారోకో చేశారు. దీంతో నల్లజర్ల – కొయ్యలగూడెం మార్గంలో వాహనాల రాకపోకలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవరపల్లి సీఐ నాయక్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఒప్పందం మేరకు ట్రాక్టర్ యజమానితో సొమ్ము ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తానేటి వనిత



ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ నాయక్

మాజీ మంత్రి వనిత పరామర్శ

ఆందోళన జరుగుతున్న సమయంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ మంత్రి తానేటి వనిత అక్కడకు వచ్చారు. మృతుని భార్య చిన్నారి, తల్లిదండ్రులు ప్రసాద్, భూలక్ష్మిలతో ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ముప్పిడి వెంకటరత్నం, దూలపల్లి ప్రసాద్, ముప్పిడి రాజు, మద్రి శోభన్‌బాబు, కృష్ణారావు, చదలవాడ ఏసురాజు, జాలాది ప్రసాద్, కందేళ్ళ గోతియ్య తదితరులు ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



నిడదవోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ

నిడదవోలు: న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా నిడదవోలు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిడదవోలు మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ పడే క్రిమినల్, చెక్కు బౌన్స్, మనోవర్తి, చిట్ ఫండ్, ఎక్సైజ్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, మొండి బాకీ కేసులను రాజీ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సివిల్ కేసులు రాజీ చేసుకుంటే అప్పటికే కట్టిన కోర్ట్ ఫీజ్ వాపసు వస్తుందన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం ఏ కోర్టు కేసులు ఆ కోర్టులోనే రాజీ చేసుకొనే వెసులుబాటు కల్పించారన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ చేసుకోనే విధంగా ఈ జాతీయ లోక్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు. రోజూ ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగులు ఏర్పాటు చేసి ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ ఇప్పించి కేసులను రాజీ చేస్తున్నామన్నారు. రాజీ మార్గం రాజమార్గం కాబట్టి కక్షిదారులు ఇటువంటి చక్కటి అవకాశాన్ని వినియోగించుకుని కోర్టులో ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా తమ విలువైన సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని ఆయన కోరారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు జాతీయ లోక్‌అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పలువురికి మాజీ మంత్రి వనిత పరామర్శ

ద్వారకాతిరుమల: పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత గురువారం పరామర్శించారు. ఇటీవల బాలరాజు తల్లి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ మంత్రి వనిత, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో బాలరాజు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో సాయి బాలపద్మ, గోపాలపురం నియోజకవర్గ నాయకులు ఖాదర్ వలి, ముల్లంగి శ్రీనివాస్, సాలి వేణు, శ్రీరామమూర్తి, మల్లిపూడి నాగమణి, షేక్ మస్తాన్ బాషా, వివేక్, మాల్లిపూడి సలీం, షేక్ నబి ఉన్నారు.



తెల్లం బాలరాజును పరామర్శిస్తున్న రాష్ట్ర మాజీ హోం మంత్రి వనిత, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు

కవలకు పరామర్శ

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ నాయకుడు, దేవరపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్‌ను మాజీ హోం మంత్రి తానేటి వనిత గురువారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి సీతామహాలక్ష్మి ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటానికి వనిత పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వేదమంత్రాలతో మార్మోగుతున్న గౌరీపట్నం



- వైభవంగా మహాలింగేశ్వరస్వామి ఆలయ పునప్రతిష్ఠాపన
- విద్యుద్దీపకాంతులీనుతున్న ఆలయ ప్రాంగణం

దేవరపల్లి: గౌరీపట్నం గ్రామంలో వేదమంత్ర ఘోష మార్మోగుతోంది. గ్రామంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఐదు రోజులుగా మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవస్థానంలో జీవ ధ్వజస్తంభం, నందీశ్వరుడు, పరివార దేవతల ప్రతిష్ఠాపనలు అత్యంగ వైభవంగా నిర్వహించారు. ఆండ్రు శ్రీనివాస్, ఉషారాణి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, వేద పండితుల ఆశీర్వాదం పొందుతున్నారు. ఈ ఆలయాన్ని రూ.5 కోట్లతో పునర్నిర్మించారు. ఆలయం నలువైపులా గోపురాలు నిర్మించారు. తూర్పు రాజగోపురం వద్ద సుమారు రెండెకరాల్లో రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన కొలనును



గౌరీపట్నంలో మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన నందికి పూజలు చేస్తున్న భక్తులు

చూసి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం ప్రాంగణం విద్యుద్దీపకాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. కేరళలోని త్రిసూర్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన చండా వాయిద్యం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మసూత్రం కలిగిన సుమారు 500 ఏళ్ల నాటి ఈ శివలింగానికి గురువారం 400 లీటర్ల ఆవుపాలు, 100 లీటర్ల పెరుగు, 500 కొబ్బరి బొండాల నీరు, తేనె, పసుపు కుంకుమలతో వేదపండితులు అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా దూబచర్ల, గంటావారిగూడెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణం అప్పారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పలు గ్రామాల్లో..

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం, తాడిమళ్ల, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని కోరుమామిడి, రావిమెట్ల, శంకరాపురం, మునిపల్లి, కోరుపల్లి, పెండ్యాల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఉండ్రాజవరం: 33 కేవీ పాలంగి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మండలంలో పాలంగి, చివటం, కె.సావరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.